మినీ కథ

# నిశ్శంకితుడు

**దాసు** దేహమంతా సందేహాలమయమే. తన నీడను చూసి తానే భయపడుతుంటాడు. అసలు పేరేమిటో గాని అందరూ సందేహాలదాసనే పిలుస్తారు. పొద్దున లేచింది మొదలూ రాత్రి పడుకోబోయేదాకా ఏది చూసినా అనుమానమే, భయమే, అపనమ్మకమే, పిచ్చి పిచ్చి ఆలోచనలే. పడుకున్నా అతగాడికి వచ్చే కలలు అన్నీ దగుల్బాజీవే. ఉద్యోగం పోయినట్లో, పెళ్ళాం ఎవరినో తీసుకుని లేచిపోయినట్లో, కొడుక్కు ఉద్యోగం దొరక్క ఆత్మహత్య చేసుకున్నట్లో! కలవరిస్తూ, తను నిద్ర పోకుండా తన వాళ్ళను నిద్ర పోనీయకుండా రాత్రుళ్ళుకూడా అవస్థ పెట్టేస్తుంటాడు. ఫలితంగా పీక్కుపోయిన కళ్ళూ, నెరిసిన జుట్టుతో ముసలితనం సొంతం చేసుకున్నాడు. అందరూ 'మీ సర్వీసెన్నాళ్ళున్నదండీ?' అనడుగుతుంటే 'నా కింకా ఇరవయ్యేళ్ళ సర్వీసుందయ్యా' అని గొంతు చించుకుని రుసరుసలాడుతూ చెబుతాడు, ఇరవైలోనే అరవై అడుగు పెట్టిన దాసు.

ఏ శంకలూ లేకుండా దాసు చేసిన ఒకే మంచి పనేమిటంటే, ఒకే ఇంట్లో పదేళ్ళబట్టీ అద్దెకుండటం. అది తన మంచితనమే తప్ప, ఇంటివాళ్ళ విశాల దృక్పథం అని నమ్మని పిచ్చోడు. పక్క వాటాలో ఉన్నా ఇంటివాళ్ళను అనుక్షణం అనుమానిస్తూనే గడుపుతుంటాడు. దాసు పెళ్ళాం కూడా అతగాడిలాంటిదే అయితే ఇంటివాళ్ళు పెట్టే బేడా ఎప్పుడో బయట పారేసి ఉండేవాళ్ళు. అందరికీ తల్లో నాలుకలా ఉంటుం దా ఇల్లాలు. భగవంతు డలాగే ఏర్చి కూర్చుతాడేమో సంసారాలు విచ్చిన్నం కాకుండా!

"దాసూ! దాసూ!" తలుపు కొట్టాడు రంగనాథం ఉదయం తొమ్మిది గంటలప్పుడు.

తలుపు తీసిన దాసు ఆశ్చర్యపోయి రంగనాథాన్ని అమాంతంగా కావలించుకున్నాడు "ఎన్నాళ్ళకు చూశాన్రా?" అంటూ.

"ఈ ఊరు ట్రాన్స్‌ఫరయివచ్చాను. ఇంటికోసం అన్వేషిస్తున్నాను. నువ్వు సహాయం చేయాల్సిరా? అన్నట్టు దీని కెంత రెంటిస్తున్నావు?" తాపీగా కూర్చుంటూ అడిగాడు.

"రెండొందలు." నెమ్మదిగా అన్నాడు ఏదో తప్పు పని చేసినట్లుగా.

"వాట్! రెండొందలా! డెడ్ చీప్! ఎట్టా పట్టావురా ఇంత పెద్దిల్లు ఆ రేటుకు!" పరకాయించి చూస్తూ అడిగాడు.

దాసు గుండె గుబగుబలాడింది. 'కొంప తీసి ఇంటాయన దశరథరామయ్య వింటే ఇంకేమైనా ఉందా?'

"ష్! నెమ్మదిగా మాట్లాడరా! ఏదో పదేళ్ళబట్టీ ఉంటున్నా గనక ఆ మాత్రం లెవెల్. అంతే." సమర్థింపుగా అన్నాడు.

"ఏమైనా ప్రస్తుతం ఉన్న రేట్లనుబట్టి ఇది కారుచౌక- అంతే." ఘంటాపథంగా చెప్పాడు రంగనాథం.

శ్లేష్మంలో పడ్డ ఈగలా గిలగిలలాడాడు దాసు. "అలా బయటకు వెళ్ళి మాట్లాడుకుందాం పద!" బలవంతంగా రంగనాథాన్ని బజార్లోకి ఈడ్చుకొచ్చాడు.

"నమస్కారమండీ!" లోపలికి వస్తున్న దశరథరామయ్య రంగనాథానికి నమస్కరిస్తూ, "ఎప్పుడొచ్చారు?" అన్నాడు వినయంగా. బిత్తరపోయాడు దాసు. 'రంగనాథం తన ఇంటి ఓనరుకు ఇదివరకే తెలుసా?'

"ఈ ఊరు ట్రాన్స్‌ఫరయిందండీ! ఈ దాసు మా ఫ్రెండ్. ఇళ్ళ కోసం అన్వేషిస్తున్నాను." రంగనాథం అన్నాడు.

"రండి. లోపలికి వెళ్ళి మాట్లాడుకుందాం." ఆప్యాయంగా ఆహ్వానిస్తూ అన్నాడు దశరథరామయ్య.

"నువ్వు పద దాసూ! నేను కాస్సేపు దశరథరామయ్యగారితో మాట్లాడి వస్తాను. వీరుకూడా నీలాగే నాకు బాగా ఆత్మీయులు." చొరవగా లోపలికి వెళుతున్న వాళ్ళిద్దర్నీ చూసి దాసు గుండెలో రాయి పడింది.

'నిజమే! తను తక్కువ అద్దె ఇస్తున్నాడు. ఇప్పుడు ఛాన్స్ దొరికింది కాబట్టి తనను ఖాళీ చేయిస్తాడా దశరథరామయ్య?' బి.పి. పెరిగినట్లయింది దాసుకి. నీరసంగా ఆఫీసుకు నడిచాడు. ఆఫీసులో ఏ ఫైలూ తాక బుద్ధి కాలేదు. కళ్ళ ముందు దశరథరామయ్య గూండాలను పెట్టి తన సామాను బయట పారేస్తున్నట్లూ, ఇంకా రకరకాల దృశ్యాలూ కదలాడాయి.

లంచ్ టైమ్ అయింది. దాసు బయటకు కదలకుండా దిగాలుగా కూర్చున్నాడు. ఎదురుగా టిఫిన్ బాక్సు వెక్కిరిస్తూ ఉంది.

"సార్, మీకు ఫోన్." ప్యూన్ గరటయ్య పిలుపు. నీరసంగా నడిచాడు లోపలికి.

"హల్లో, దాసూ! నా కిల్లు దొరికిందిరా! దశరథరామయ్యగారే ఇచ్చారు! వివరాలు సాయంత్రం చెబుతాను. బిజీగా ఉన్నాను." రంగనాథం ఫోన్ పెట్టేశాడు.

దాసు గుండెలో రైళ్ళు పరిగెత్తినట్లయింది. 'అయింది. కొంప ముంచేశాడు ముసలాడు. పదేళ్ళబట్టీ ఉన్నామన్న విశ్వాసం కూడా లేకుండా ఎక్కువ అద్దెకు కక్కుర్తి పడి తన భాగం రంగనాథాని కిచ్చేశాడు.'

కుర్చీలో కూలబడ్డాడు దాసు. కళ్ళ ముందు దశరథరామయ్య రావణాసురుడులా పది తలలతో వికటాట్టహాసం చేస్తున్నట్లు...

"అబ్బా!" తల గట్టిగా పట్టుకున్నాడు.

"వాట్, మిస్టర్ దాసూ! ఒంట్లో బావోలేదా!" అటుగా వచ్చిన ఆఫీసర్ అడిగాడు ఇతగాడి వాలకం చూసి.

"లే...లేదుసార్! అవును సార్! తలనొప్పి." తడబడ్డాడు దాసు.

"అయితే పర్మిషన్ పెట్టి ఇంటి కెళ్ళండి." సానుభూతిగా చూశాడు.

నీరసంగా లేచాడు దాసు. పర్మిషన్ తీసుకుని బయటకు నడిచాడు. 'ఇంటికి పోయి ఏం చెయ్యాలి? చావుకబురు చల్లగా చెబుతాడేమో దుర్మార్గుడు!' తలలో లక్ష ఆలోచనలు. 'అసలు ఖాళీ చెయ్యకపోతే ఏం చేస్తాడు! పదేళ్ళబట్టీ ఉంటున్నాడు. తన కామాత్రం హక్కులుండవా?' దాసులో మొండిధైర్యం.

'అమ్మో! రౌడీలను పెట్టి ఖాళీ చేయిస్తే!' గజగజా వణికాడు ఆ ఊహకే దాసు.

"ఇదుగో దాసూ! దాసుగారూ!" గట్టిగా పిలుస్తున్న మనిషిని చూసి తెల్లబోయాడు.

'ఇక్కడికే తయారయ్యాడే! పాడు పీనుగ!' పళ్ళు కొరుక్కున్నాడు.

దాసు మొహంలో ఏడవలేక నవ్వు.

"అమ్మయ్య! మీరే కనిపించారు. మీ కోసమే వస్తున్నా!" దశరథరామయ్యలో రిలీఫ్.

'అయిపోయింది. అంతా అయిపోయింది. ఇక ఆ దుర్వార్త చెబుతాడు కాబోలు!' దాసులో నిస్పృహ.

"రండి! అలా హొటలుకు వెళ్ళి మాట్లాడుకుందాం."

బలిపశువులా నడిచాడు దాసు. "ఇదుగో సర్వర్! రెండు కాఫీ పట్రా." దశరథరామయ్య ఆర్డరిచ్చాడు.

"దాసుగారూ! మీతో ఒక విషయం చెబుదామనుకున్నా. ఇంతలో మీ ఫ్రెండ్ రంగనాథం వచ్చాడు పొద్దున. ఈ పదేళ్ళబట్టీ మనం ఎంతో ఆత్మీయంగా కలిసిపోయాం. అయినా విడిపోక తప్పదు. నేను మా అబ్బాయి దగ్గరికి వెళ్ళి ఉందామనుకుంటున్నాను. పెద్దవాణ్ణవుతున్నాను. ఎల్లకాలం నాకూ, మీ పిన్నిగారికీ ఆరోగ్యాలు ఒక రీతిగా ఉండవుగదా! అందుచేత మేం ఉంటున్న భాగం రంగనాథంగారి కిచ్చేశాను. మంచి మనసున్న మీరే మా ఇంటి బాధ్యత తీసుకుని అద్దె పంపుతూండండి. మీకు తోచినప్పుడు మీ ఇష్టం వచ్చినంత పెంచి మీ అద్దె పంపండి. ఒకవేళ రంగనాథంగా రుంటున్న వాటా ఖాళీ అయితే మీరే మంచివాళ్ళను చూసి అద్దె కిచ్చి, ఆ అద్దెకూడా మాకు పంపుతుండండి. మీకు శ్రమ ఇచ్చినందుకు ఏమీ అనుకోరు కదూ!"

రెండు చేతులూ పట్టుకున్న దశరథరామయ్య వంక విభ్రాంతిగా చూశాడు దాసు. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి గిర్రున. ఎదురుగా పెట్టిన కాఫీ అమృతంలా అందుకున్నాడు దాసు. ఆ కన్నీళ్ళకు అర్థం వేరేలా చెప్పుకున్నాడు దశరథరామయ్య.

ఆ రోజునుంచీ సందేహాల దాసు అని అతన్నెవరూ మరి పిలవలేదు.

-సుచంద్ర

## ముందుకే...

పాతుకున్న ఆ చెట్టు కింద
సేద తీర్చుకున్నంతసేపే హాయి.
నీడ వద్దనుకొని ఒంటరిగా
నడిస్తే
పొడిచి చంపే కాకులు.
ప్రజ్ఞాన దండంతో
బెదిరించినా
చెట్టుకు అంటుకుపోయిన
కాకుల గోల.
మళ్ళీ చెట్టుకిందికే పోదామని
బలవంత పెడుతున్న మనసు;
మొరాయిస్తున్న చేతన.
చైతన్యాన్నే నమ్ముకున్నందుకు
ముందుకే నా నడక.

-ఆర్వీయస్. సుందరం